ప్రజాశక్తి
మంగళవారం 13 ఫిబ్రవరి 2024 5
శ్రీ సత్యసాయి

జెండాను ఎగురవేసి బాలోత్సవాన్ని ప్రారంభిస్తున్న షమీమ్ షఫీ ఉల్లా

# భళా..బాలోత్సవం..!

◆ అట్టహాసంగా 'అనంత బాలోత్సవాలు-4' ప్రారంభం

◆ సందడి చేసిన పిల్లలు

◆ ఆకట్టుకున్న ప్రదర్శనలు

◆ ఆలోచింపజేసిన సైన్స్ నమూనాలు

◆ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కిటకిటలాడిన ఆర్ట్స్ కళాశాల మైదానం

◆ ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడే..సందడి..!

విజేతలకు బహుమతి అందిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

**అంకెల సంఖ్యల మధ్య నలిగిపోయిన బాల్యానికి ఆటవిడుపు దొరికింది... మార్కుల వేటలో బందీ అయిన మెదడుకు కాస్త ఉపశమనం లభించింది... పుస్తకాల మధ్య ఇరుక్కుపోయిన సృజనాత్మకత బయటకు వచ్చింది... నాలుగుగోడల మధ్య నిలిచిన బాల్యపు మధురిమ ప్రపంచానికి తెలిసింది... ఆటపాటలు, నృత్యరూపాలు, కళానైపుణ్యాలు, అద్భుతమైన తెలివితేటల నడుమ చిన్నారులు చేసిన సందడితో అనంత బాలోత్సవ ప్రాంగణం మురిసిపోయింది..!**

**కళాత్మక ప్రదర్శనలతో కనులవిందు చేశారు. సైన్సు ప్రదర్శనలతో అందరినీ ఆలోచింపజేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో అబ్బురపరిచారు. వందలాది మంది చిన్నారులు ఒక్క చోట చేరి అనంత పండుగను కనులు ముందు సాక్షాత్కరింపజేశారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానం వేదికగా జరుగుతున్న అనంత బాలోత్సవాలు-4 సోమవారం నాడు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ పిల్లల పండుగలో మొదటి రోజు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది విద్యార్థులు, చిన్నారులు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారు.**

ప్రదర్శన చేస్తున్న పిల్లలు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంత బాలోత్సవం-4 పిల్లల పండుగ అనంతపురం నగరంలో సోమవారం నాడు ప్రారంభమైంది. ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో భారతరత్న, మాజీ ప్రధాని పివి.నరసింహారావు ప్రాంగణంలో ఆరు స్టేజ్‌ల్లో కల్చరల్ ఈవెంట్స్‌లో చిన్నారులు వారి ప్రదర్శనలు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాలలో అకడమిక్ విభాగంలో వ్యాసరచన, వక్తృత్వం తదితర పోటీలు జరిగాయి. మొదటి రోజు పిల్లలు ఆటపాటలతో చిందులేయడమే కాకుండా, తమ విజ్ఞానాన్ని ప్రదర్శించే పోటీల్లో పాల్గొన్నారు. రంగురంగుల దుస్తులతో విద్యార్థులు విచిత్ర వేషధారణ కన్పించారు. జానపద పాటలు పాడారు. అల్లూరు సీతారామరాజు, రాణి రుద్రమదేవి, భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్ తది తర వేషధారణతో నటనా ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. ఇలా ఒకటేమిటి వందలాది వేషధారణలో చిన్నారులు ప్రదర్శనలు చేశారు. తమపిల్లల ప్రతిభా పాటావాలను చూసి మురిసిపోయే తల్లులు కొందరు ఆవరణంలో కనిపించగా, తమ పాఠశాల విద్యార్థి మెరుగైన ప్రదర్శన చేయాలని మరికొంత మంది ఉపాధ్యాయులు ఆరాటపడటం అక్కడ కనువిందు చేసిందనే చెప్పాలి. ఆర్ట్స్ కళాశాల మైదానం మొత్తం పిల్లల పండుగతో కళకళలాడింది.

**ఉత్సాహభరితం..**

బాలోత్సవంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వందకుపైగా పాఠశాలల నుంచి విద్యార్థులు 2000 మంది వరకు పాల్గొన్నారు. రెండు విభాగాల్లో ఆకడమిక్, కల్చరల్ పోటీల్లో పిల్లలు పాల్గొన్నారు. 64 ఈవెట్స్‌లో విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. ఒకవైపు అడకమిక్,

రైతు వేషధారణలో చిన్నారి

కుమారునికి అల్లూరి సీతారామ రాజు వేషధారణ వేయించి బాలోత్సవకు తీసుకున్న వస్తున్న చిన్నారి తల్లి

మరోవైపు కల్చరల్ పోటీలు మొదటి రోజు జరిగాయి. అడకమిక్ పోటీలకు విద్యార్థులు అధికంగా మొదటి రోజు పోటీపడ్డారు. చిత్రలేఖనం, కార్టూన్, వ్యాసరచన, కథారచన, దినపత్రిక పఠనం, మెమోరీ టెస్టు, స్పెల్ బి, బేస్ట్ ఫ్రంవేస్టు, సైన్సు ఎగ్జిబిషన్‌లో అడమిక్ పోటీలు ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. కల్చరల్ ఈవెంట్స్‌లో జానపద గీతాలాపన, దేశభక్తి గీతాలాపన, లఘునాటికలు, జానపద గీతాలాపన, విచిత్ర వేషధారణ ప్యాన్సీ డ్రెస్‌లు పోటీలు విద్యార్థులు పోటాపోటీగా సాగాయి. మొదటి రోజు పోటీల్లో విజేతలకు సాయంత్రం వేదిక వద్దనే బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డితో పాటు పలువురు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు.

**శాస్త్రీయ ఆలోచనల వైపు అడుగేద్దాం..**

బాలోత్సవ ప్రారంభ వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీఉల్లా, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాల్యం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్, బాలోత్సవ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామరాజు, అనంత బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, జెవివి నాయకురాలు డాక్టర్ ప్రసూన, ఎల్‌కెపి అధ్యక్షులు ప్రభాకర్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు సేకన్న, రచయిత నబీరసూల్ తదితరులు హాజరై వేడుకను ప్రారంభించారు. అంతుకు మునుపు బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీఉల్లా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అనంత బాలోత్సవాలు చక్కటి వేదికగా నిలుస్తాయన్నారు. చదువులు, ర్యాంకుల వేటలో బందీ అవుతున్న పిల్లలకు ఇలాంటి కార్యక్రమాలు ఆటవిడుపుగా ఉంటాయన్నారు. పిల్లలు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. పిల్లలు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. శాస్త్రీయమైన భారతదేశాన్ని స్థాపించుకోవడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, రవికాంత్ రమణ, అనంత బాలోత్సవ కమిటీ సభ్యులు లింగమయ్య, గోవిందరాజులు, కోటేశ్వరప్ప, నాగేంద్ర, రామాంజినమ్మ, రాజేశ్వరి, శ్యామల, అరుణమ్మ, పాల్గొన్నారు.

బాలోత్సవం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న షమీమ్ షఫీఉల్లా...

బొలేరో క్యాబిన్‌లో పడి ఉన్న మృతులు

## పెళ్లి వేడుకలో విషాదం

### లారీ బొలేరో ఢీ - ముగ్గురు మృతి

**ఎంతో సంతోషంగా పెళ్లివేడుకలో పాల్గొనేందుకు వెళ్లిన వారిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. వివాహ రిసెప్షన్ ముగించుకుని వస్తున్న వారి వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే ముగ్గురు మరణించారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, గాయపడిన వారంతా ఒకే గ్రామం, బంధువులు కావడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా అగళి మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘోర రోడ్డు ప్రమాదం పలుకుటుంబాల్లో చీకట్లను నింపింది.**

వార్త మెయిన్‌లో

## టిడిపిలో పలువురు చేరిక

టిడిపిలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

**ప్రజాశక్తి-కదిరి టౌన్ :** భవిష్యత్తులో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దగ్గర జనమే ఉండరని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ జోస్యం చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డులో దాదాపు 100 కుటుంబాలు వైసీపీ విడిచి టిడిపిలో చేరాయి. 34వ వార్డుకు చెందిన నాగే నర్సింహులు, వల్లేపు వెంకటరమణ, వల్లెపు వెంకటేష్, డేరెంగుల వెంకటేష్, జెరిపిటి ఆదినారాయణ, వల్లేపు సురేష్, ఎద్దుల గంగన్న,మల్లెం గంగులప్ప, మోపురి రమణ ,మోపురి రామకృష్ణ, కోగురు రమణ, గొందిపల్లి జయరాం ,బడిశెట్టి రామకృష్ణ తో పాటు పలువురికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, బంగారు కృష్ణమూర్తి, కుటాగుల గంగరాజు, శంకర, అహమద్ అలీ,హుస్సేన్ భాష, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు బాపనపల్లి శ్రీరాములు, కృష్ణ, బొట్టు చంద్ర, రఘు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

సమస్యలు విన్నవించడానికి వచ్చిన మహిళలు

**ప్రజాశక్తి - మడకశిర**

మడకశిర మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్లు, రోడ్డు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని పలుగ్రామాల ప్రజలు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో అర్జీ ఇచ్చేందుకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిత్రాన్ని ఇఒఆర్‌డి శైలజకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మరుగుదొడ్లు లేక దూరంగా ఉన్న బయలు ప్రదేశాలకు మహిళలు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇళ్లమధ్య మురుగు నిలబడి వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. మురుగు సమస్యతో ఓ శిశువు మృతి చెందిందని అన్నారు. గతంలో జరిగిన విషాదాన్ని వివరించారు. సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

## నారా భువనేశ్వరి పర్యటన ఏర్పాట్లు పరిశీలన



విమానాశ్రయం వద్ద 'పల్లె'

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

పుట్టపర్తి నియోజకవర్గానికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం రానున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పుట్టపర్తి విమానాశ్రయంలో ఏర్పాట్లను పరిశీలించారు.. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఆమె పుట్టపర్తి మండల పరిధిలోని గాజులపల్లి ,ఒడిసి మండలం గాజుకుంటపల్లి గ్రామాలలో పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో ఏర్పాట్లను మాజీ మంత్రి పల్లె పరిశీలించారు.

## 'కాపు' స్విచ్ఛాఫ్..!

### రాజకీయాల్లో కొనసాగుతున్నా అనేక ఊహాగానాలు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఎవరికీ అందుబాటులో లేకుండా ఉండటం ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశం అవుతోంది. ఆయనకు వైసిపి పెద్దల నుంచి వెల్‌కమ్ లభించిందన్న ప్రచారమూ నడుస్తోంది. అయితే దీనిపై స్పష్టమైన నిర్ధారణేది లేనప్పటికీ ఆయన మొబైల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి స్థానిక నేతలకు కూడా దూరంగా ఉండటం ఆసక్తికరంగా మారింది. ఇటీవలే ఆయన వైసిపి నుంచి బయటకు వస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. రాయదుర్గం అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా మెట్టు గోవిందరెడ్డిని ప్రకటించారు. ఈ నేపథ్యంలో స్థానిక వైసిపి నాయకులు ఆయనకు మధ్య కూడా దూరం పెరిగింది. మున్సిపల్ సమావేశంలోనూ ఆయన అధికార పార్టీ ఎమ్మెల్యే కానట్టుగానే వైసిపి ఛైర్మన్ మొదలుకుని కౌన్సిలర్లు కొంత మంది వ్యవహరించారు. దీంతో ఆయన కాంగ్రెసు పార్టీలో చేరుతారన్న ప్రచరాం జోరుగా సాగుతూ వస్తోంది. ఎఐసిసి సభ్యులైన రఘువీరారెడ్డిని ఆయన నివాసానికి కుటుంబ సమావేతంగా వెళ్లి కాపు రామచంద్రారెడ్డి కలసొచ్చారు. ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల ఇటీవల అనంతపురం జిల్లా పర్యటనలోనే చేరుతారని ప్రచారం జరిగినప్పటికీ ఆయన చేరిక జరగలేదు. రాబోయే రోజుల్లో చేరే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఇటువంటి తరుణంలో ఆయనకు తిరిగి వైసిపి పెద్దల నుంచి పిలుపు వచ్చిందన్న ప్రచారం రెండు రోజులుగా జోరుగా సాగుతోంది. అయితే దీనిపై ఆయన మాత్రం ఎక్కడా బయటకు విషయం వెల్లడించలేదు. ఈ పరిస్థితుల్లో ఆయన అందుబాటులో లేకుండా ఉండటం వెనుక బలమైన రాజకీయ కారణం ఏదైనా ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. అధిష్టానం అంటే ముఖ్యమంత్రి స్థాయి నుంచి వచ్చిందా.. లేక ఇతర నాయకుల నుంచి ఈ ప్రయత్నం జరిగిందా అన్న దానిపై స్పష్టత లేదు. వైసిపి నుంచి బయటకు వస్తున్నా అన్న సమయంలో ముఖ్యమంత్రిని కలువడానికి ప్రయత్నించినా అవకాశం లేకపోవడంతోనే బయటకు వస్తున్నా అంటూ తాడేపల్లికి గుడ్‌బై చెప్పి వచ్చారు. వైసిపి ఆవిర్భావం నుంచి జగన్మోహన్‌రెడ్డి వెంట నడిస్తే తనకు గుర్తింపు లేకుండాపోయిందని ఆయన తన మద్దతుదారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కాపునకు మంత్రి పదవుల్లో స్థానం లభిస్తుందని ఆశించినా అలాంటిదేమీ జరగలేదు. ఇప్పుడు జరగబొయే సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా టిక్కెట్టు కూడా లేదనే సరికి వైసిపికి గుడ్‌బై చెబుతున్నట్టు ప్రకటించారు. ఇప్పుడు తిరిగి పిలుపొస్తే ఏమి చేస్తారన్న చర్చ నడుస్తోంది. అధిష్టానం నుంచి పిలుపొచ్చి సర్దిజెప్పే ప్రయత్నం చేస్తే ఒప్పుకుంటారా లేదా అన్నది రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఆయన బయటకొచ్చి ఏదైనా ప్రకటన చేస్తే తప్ప ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నేడు కణేకల్‌లో జరిగే ఓ కార్యక్రమంలో కాపు పాల్గొనే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అక్కడైనా దీనిపై ఒక క్లారిటీని ఇస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

మీటర్ల బిగింపును అడ్డుకుంటున్న నాయకులు, రైతులు

## మోటార్లకు మీటర్లు... రైతుల మెడకు ఉరితాళ్లు..

**ప్రజాశక్తి మడకశిర**

మోటర్లను మీటర్లు బిగింపు చర్యలు రైతుల మెడకు ఉరితాళ్లే అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని కళ్లుమర్రి పంచాయతీలోని రైతుల మోటార్లకు విద్యుత్ అధికారులు, గుత్తేదారులు మీటర్లు బిగించడాన్ని సర్పంచి గంగమ్మ నాగరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు, రైతులు అడ్డుకున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ మీటర్లు తమకు అవసరం లేదని తేల్చిచెప్పారు. అడుగంటిపోయిన బోరు బావుల్లో నీరు లేక ఇప్పటికే నష్టపోతున్నామన్నారు. ఈ మీటర్లు బిగిస్తే రూ.5వేల నుండి 6వేల రూపాయల దాకా బిల్లు వస్తుందని ఆమొత్తాన్ని ఎవరు కడతారని ప్రశ్నించారు. పంటలు పండక రైతులు ఇప్పటికే నానారకాలుగా నష్టపోతున్నారని అన్నారు. కర్నాటకకు చెందిన సురేష్ కు కాంట్రాక్ట్ ప్రభుత్వం అప్పగించిందని మోటార్లకు మీటర్లు బిగించడానికి వచ్చిన సూపర్ వైజర్ తెలిపారు. లైన్మెన్ అనుమతి తీసుకున్నామన్నారు. అయినప్పటికీ రైతులు మీటర్ల బిగింపును అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ నాగరాజు, సదాశివరెడ్డి, నరసింహప్ప, నర్సీగౌడ, పెద్ద మూర్తి, నరసన్న, కొండప్ప, కదిరి ప్రభాకర్, ముని, నరసింహ రెడ్డి, నర్సిరెడ్డి, సత్యనారాయణ, సోమశేఖర్, గోవర్ధన్ రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభా విద్యార్థులకు బహుమతులు

**కొత్తచెరువు రూరల్ :** మండల పరిధిలోని కేశాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ పార్లమెంటు సభ్యులు పాముదుర్తి భయపరెడ్డి ఫౌండేషన్, శ్యాం ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ అంశాలపై ప్రసంగాలను నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ముగ్గురిని ఎంపిక చేసి వారికి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా రూ. 7, 500, మూడో బహుమతిగా రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, వైసిపి మండలకన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలపై ఆందోళన

**కొత్తచెరువు :** విద్యుత్ కోతలకు నిరసనగా కొత్తచెరువువిద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టీడీపీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి నుండి సబ్ స్టేషన్ వరకు టిడిపి నాయకులు కార్యకర్తలు రైతులు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు రెండు గంటల కోత విధిస్తున్నారని, విద్యుత్సరఫరాను పగటి పూట ఇవ్వకుండా రాత్రి వేళల్లో ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పగటి పూట తొమ్మిది గంటలు విద్యుత్తును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ట్రాన్స్‌కో ఎఇ వెంకటేష్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, నాయకులు లక్ష్మీనారాయణ, చంద్రమోహన్, బండ్లపల్లి రాజు, రఘుపతి, రవీందర్ రెడ్డి, నాగేంద్ర, వెంకటరమణప్ప తదితరులతో పాటు అధికసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఓడీసీ తహశీల్దార్‌గా ఖాజాబీ

**ఓబుళదేవరచెరువు :** ఓబుళదేవరచెరువు తహశీల్దార్‌గా ఖాజాబీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రామ్‌నాథరెడ్డి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా (రాయచోటి) గుర్రంకొండ తహశీల్దార్‌గా ఖాజాబీ బాధ్యతలు చేపట్టారు.

## పేదల స్థలం కబ్జా

**సోమందేపల్లి :** మండల కేంద్రంలోని నక్కలగుట్ట ఇందిరమ్మ ఆదర్శ కాలనీలో ఫ్లాట్ నెంబర్ 373 ను వైసీపీ నాయకుడు కబ్జా చేస్తున్నాడని బాధితులు వాపోయారు. ఈ మేరకు సిపిఐ మండల కార్యదర్శి బాలస్వామి ఆధ్వర్యంలో బాధితులు జానకమ్మ శంకరప్పలు సోమవారం స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

## ఇన్‌ఛార్జి ఎంపిడిఓగా సిద్ధారెడ్డి

**కొత్తచెరువు :** కొత్తచెరువు ఇన్‌ఛార్జి ఎంపిడిఓగా సిద్ధారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో బారాన్‌సాహెబ్ కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు ఇక్కడ ఈవోఆర్డీగా ఉన్న సిద్ధారెడ్డిని ఎంపీడీవోగా ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం

**బుక్కపట్నం :** కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన పలు కుటుంబాలను పరామర్శించారు. కోట వీధిలో ఇటీవల మృతి చెందిన హైదయితుల్లా, జిక్రియా కుటుంబాలను పరామర్శించారు. గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పెంజూరి కృష్ణమూర్తి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, సర్పంచి నాగలక్ష్మి రాజు, అగ్రి అడ్వైజర్ చైర్మన్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గాండ్లపెంట తహశీల్దార్‌గా డి. శ్రావణి

**గాండ్లపెంట :** గాండ్లపెంట తహశీల్దార్‌గా శ్రావణి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా అన్నమయ్య జిల్లాలో కలెక్టరేట్లో విధులు నిర్వహిస్తున్న డి. శ్రావణి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహశీల్దార్‌గా ఉన్న హమీద్ భాషా కనగానపల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రావణి మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవి, సిఎస్‌డిటి సురేంద్ర, ఆర్ఐ మున్వర్‌బాషా, వీఆర్వోలు జయరాములు, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణమండపం ప్రారంభం

**తనకల్లు :** మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో కొండ శివ సాయి నూతన కళ్యాణమండపం ప్రారంభోత్సవం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. అంతకు ముందు మండల పరిధిలోని టీ సదుం గ్రామంలో నిర్వహిస్తున్న రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్రఉపాధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి, కొండా ఈశ్వరయ్య, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్ శంకర్ నాయుడు, సోంపాలెం నాగభూషణ పాల్గొన్నారు.

## రైతులకు పండ్లమొక్కలు పంపిణీ

**కదిరి అర్బన్ :** రెడ్స్ సంస్థ కార్యాలయ ఆవరణంలో రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సేట్రీ సంస్థ జిల్లా మేనేజర్ మనోహర్ ,రెడ్స్ డైరెక్టర్ భానుజ హాజరయ్యారు. ఈసందర్భంగా భానుజా మాట్లాడుతూ సేట్రీ వారి సహకారం తో సత్యసాయి జిల్లాలో పచ్చదనం పెంపుదలకు కృషి చేస్తున్నామన్నారు. మనోహర్ మాట్లాడుతూ సే ట్రీ సంస్థ సత్యసాయి జిల్లాలో రైతులకు రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో పండ్ల మొక్కల పెంపకం కార్యక్రమం చేపట్టిందన్నారు. రైతులు ఒకే రకం పంట సాగు చేయడం వల్ల దిగుబడి తగ్గి నష్ట పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సేట్రీ సిబ్బంది పీరు సాబ్, రెడ్స్ కోర్డినేటర్ ఎల్లప్ప, బాబ్జాన్, రవీంద్ర రైతులు పాల్గొన్నారు

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన

**హిందూపురం :** హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అసుపత్రి సుపరిటెండెంట్ రోహిల్ కుమార్ తో కలిసి ప్రతినిధులు తుషార్ మోక్షి, శ్రీక్షి దీవాన్ అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అసుపత్రుల అభివృద్ధి కోసం కేటాయించిన నిధుల ద్వారా ఎలాంటి అభివృద్ధి చేశారన్న విషయంపై అధ్యయనం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఒ రుక్మిణమ్మ, వైద్యులు పాల్గొన్నారు.

# చెక్కులు సరే ... తాగేందుకు నీరు కూడా ఇవ్వరా..?

మహిళలకు నమస్కరిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

## ఆసరాచెక్కుల పంపిణీలో మహిళల ఇబ్బందులు

**ప్రజాశక్తి- పరిగి**

మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీలో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక బీరలింగేశ్వర స్వామి కళ్యాణమండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి ఉషశ్రీ చరణ్ వస్తున్నారని మహిళలు తప్పనిసరిగా హాజరుకావాలని లేనియెడల వారికి వచ్చే ప్రభుత్వ పథకాలు తొలగిస్తామని స్థానిక వెలుగు అధికారులు, నాయకులు మహిళలను హెచ్చరించిన వైనం వెలుగులోకి వచ్చింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామాల నుండి మహిళలు తరలివచ్చినా వారికి కనీసం నీడ ఏర్పాటులో స్థానిక నాయకులు అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఉదయం11 గంటల నుండి ఎంతోమంది మహిళలు వాహనాలలో కార్యక్రమానికి వచ్చినప్పటికీ మధ్యాహ్నం భోజన సదుపాయం కానీ నీటి సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాలలో యానిమేటర్లు నుండి ఏపీఎం వరకు ఈ కార్యక్రమం పై ప్రత్యేక దృష్టి పెట్టడం మంత్రి నుండి కూడా విజయవంతం చేయాలని ఆదేశాలు రావడంతో వెలుగు అధికారులు సతమతమయ్యారు. రోజు కూలిపనులకు వెళ్లే మహిళలు సైతం తమ జీవన ఉపాధి వదిలి కార్యక్రమానికి తప్పనిసరిగా రావాలని హెచ్చరించారు. రాకపోతే పథకాలు రావని బెదిరించడంతో మహిళలు ఇబ్బందులకు గురయ్యారు.కార్యక్రమం ముగిసిన తర్వాత తమ గ్రామాల నుండి తీసుకొచ్చిన వాహనాలు లేకపోవటంతో పలువురు మహిళలు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. ప్రయాణానికి సరిపడా నగదు లేక దిక్కుతోచన స్థితిలో నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమం విజయవంతం చేయాలని కారణంగా మహిళలను ఇబ్బంది పెట్టడం సరికాదని పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గిరిజనుల సమస్యలపై వినతి

**ప్రజాశక్తి - పెనుకొండ**

వినతిపత్రం సమర్పిస్తున్న మహిళలు, నాయకులు

సోమందేపల్లి మండలంలోని వెలగమాకల పల్లి తండాలోని గిరిజనుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాధితులు డిఎకు వినతిపత్రం సమర్పించారు. వ్యకాసం సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో కొండ , గుట్టల మధ్య ఏమాత్రం రాక పోకలు సౌకర్యం లేకుండా అసౌకర్యాల నడుమ గిరిజనులు జీవిస్తున్నారన్నారు. ఇప్పటికే సబ్ కలెక్టర్ తండాలో పర్యటించిన సందర్భంగా వారు తమ సమస్యలను విన్నవించారన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు గిరిజన మహిళల ఆవేదనను అర్థం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, సిపిఎం స్థానిక నాయకులు తిప్పన్న లతో పాటు గిరిజన మహిళలు దేవి బాయ్ , కవితా బాయ్, ప్రభావతి, నిర్మలా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాశక్తి - గోరంట్ల**

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మండలంలోని పాలసముద్రం వద్ద ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు మౌలిక వసతులు కల్పించాలని కెవిపిఎస్ నాయకులు, బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో పేదలు ధర్నా చేపట్టారు ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు మాట్లాడుతూ 8 నెలల క్రితం పాలసముద్రం గ్రామానికి చెందిన నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. వారికి కనీస సౌకర్యాలైన తాగునీరు విద్యుత్తు సౌకర్యాలు కల్పించలేదని వెంటనే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటికీ ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న 70 దరఖాస్తులు ఆన్లైన్లో నమోదు చేయలేదన్నారు. నిరుపేదలు ఇంటి నిర్మాణం చేయడానికి ప్రయత్నం చేస్తుంటే రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ అక్బర్‌బాషాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల సాధన కమిటీ పోరాట కమిటీ అధ్యక్షులు అశ్విని, వెంకట లక్ష్మమ్మ, అచ్చమ్మ, లక్ష్మీ దేవమ్మ, స్వర్ణలత నిరుపేదలు పాల్గొన్నారు.

# వైసిపి పాలనలో విద్యావిప్లవం : ఎమ్మెల్యే కేతిరెడ్డి

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

వైసిపి ప్రభుత్వ పాలనలో విద్యావిప్లవం వచ్చిందని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. కేజీ నుండి పీజీ వరకు ఉచితంగా విద్యను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ వైఎస్సార్ విద్యార్థి విభాగ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'విద్యార్థుల సాధికారత జగనన్నతో సాధ్యం' కార్యక్రమానికి వేలాది మంది హాజరయ్యారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం నుండి విద్యార్థులు ర్యాలీని చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తాము చదువుల కోసం పడిన ఇబ్బందులను గుర్తు చేసుకున్నారు. వైసిపి ప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగ్ జిల్లా అధ్యక్షులు పురుషోత్తం, రాష్ట్ర సహాయ కార్యదర్శి వేముల అమర్ నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అల్లాడి ప్రవీణ్‌కుమార్, నీలూరి ప్రకాష్, సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

## ఆసరా లబ్ధిదారులను బెదిరించడం సరికాదు : బికె

**ప్రజాశక్తి గోరంట్ల**

ఆసరా లబ్ధిదారులను వైసిపి నాయకులు బెదిరించడం సరికాదని మాజీ ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమందేపల్లి మండలంలో ఆదివారం జరిగిన ఆసరా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీకి సమావేశానికి హాజరుకాని లబ్ధిదారులను వైసిపి నాయకులు బెదిరించారన్నారు. సమావేశానికి రాకుంటే ఆసరా డబ్బులు ఇవ్వమని వైసిపి నాయకులు లబ్ధిదారులకు వాయిస్ మెసేజ్ ఇచ్చారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఉండి కూడా ఇలా బెదిరించడం సరికాదన్నారు. మంత్రి ఉషశ్రీ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఐదేళ్లపాటు అక్కడ వనరులను దోచుకొని పెనుగొండ నియోజక వర్గంలో దోచుకోవడానికి ఇక్కడికి వచ్చిందని ఆయన ఆరోపించారు ఇలాంటి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసిపి అభ్యర్థికి 2024 ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం ఓటర్లు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్రభుత్వ పథకాల డబ్బును అధికారులు లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తారని లబ్ధిదారులు వైసిపి నాయకుల బెదిరింపులకు భయపడొద్దని అన్నారు.

## చిన్నారుల ఆలోచనలకు ప్రతిరూపం అద్భుత ప్రయోగాలు

**ప్రజాశక్తి-హిందూపురం**

నమూనాలు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నారుల ఆలోచనలకు ప్రతిరూపం వారు చేసిన అద్భుత ప్రయోగాలని ఎల్ ఆర్ జి పాఠశాల హెచ్ఎం ప్రసాద్ అన్నారు. సైన్స్ డేను పురస్కరించుకుని సోమవారం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్నా ఎల్ ఆర్ జి విద్యాలయంలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఎఓ సంజీవ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు విద్యార్థులు రూపొందించిన నమూనాలను వారు తిలకించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రయోగాల్లో న్యాయమూర్తులచే ఎంపిక చేసి వారి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎహెచ్ఎం సుధ, ఉపాధ్యాయులు మారుతీ ప్రసాద్, అంజాద్, కృష్ణప్రియ, ఈశ్వరప్ప, నవ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూములు తిరిగి ఇవ్వాలి

ఆందోళనలో పాల్గొన్న రైతులు, నాయకులు

**ప్రజాశక్తి మడకశిర**

ప్రభుత్వం పరిశ్రమల కోసం సెజ్ భూములను రైతుల దగ్గర నుంచి తీసుకుని ఇంతవరకు పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని రైతుసంఘం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారెడ్డి మాట్లాడుతూ మడకశిర మండలం సి కోడిగేపల్లి సమీపంలో పరిశ్రమలు ఏర్పాటుకు సేకరించిన సెజ్ భూముల్లో ఇప్పటివరకు పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. ఆ భూములు రైతులకు తిరిగి కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో సెజ్ పరిశ్రమల కోసం మడకశిర, పరిగి మండలం లోని పలు ప్రాంతాల్లో రైతుల దగ్గర తీసుకున్నారన్నారు. ఇంతవరకు ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. ఐదు సంవత్సరాలలోపు పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే రైతుల భూములు రైతులకు వెనక్కు ఇవ్వాలన్నారు. ఈసమస్యపై కలెక్టర్‌కు పలుమార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం కన్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించకపోతే భూములను రైతులకు స్వాధీనం చేస్తామని హెచ్చరించారు. ఈ సమస్య పరిష్కారం కోసం మడకశిర నుండి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్రకైనా సిద్ధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అనుబంధ సంఘం రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, జంగాలపల్లి పెద్దన్న, సిపిఐ తాలూకా ఇన్‌ఛార్జి పవిత్ర, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ రైతులు పాల్గొన్నారు.

## హక్కులను హరిస్తున్న ధర్మవరం పోలీసులు

### ఎస్పీకి ఫిర్యాదు చేసిన వరదాపురం సూరి

**ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్**

ధర్మవరం నియోజకవర్గంలో పోలీసులు వైసిపి కార్యకర్తలుగా పనిచేస్తున్నారని ప్రజల హక్కులను హరిస్తున్నారని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని కలిసిన పోలీసుల పనితీరుపై ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా నిర్వాహకులను అణచివేసే విధంగా తప్పుడు కేసులు బనాయించే పరిస్థితికి పోలీసులు వచ్చారని అన్నారు. వైసిపి సోషల్ మీడియా మినహా మరెవరి పోస్టులు పెట్టరాదంటూ ఇతరులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అనవసరంగా పోలీస్ స్టేషన్లకు రప్పించడం, బెదిరించడం, కేసులు పెడతామంటూ హెచ్చరికలు చేయడం వంటి కార్యకలాపాలను ధర్మవరం పోలీస్ యంత్రాంగం అమలు చేస్తుందని ఆరోపించారు. ఇకపై ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

## కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలి

ఎంపిడిఓతో మాట్లాడుతున్న నాయకులు

**ఓబుళదేవర చెరువు :** స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయి ఉన్న 12 నెలల వేతనాలు మంజూరు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్మికులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూకార్మికులకు వేతనాలు చెల్లించడంలో అధికారులు ప్రజాప్రతినిధులు అలసత్వం వహిస్తున్నారన్నారు. తక్షణమే స్వచ్ఛభారత్ కార్మికులకు పంచాయతీ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలోరిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్పందన కార్యక్రమంలో ఎంపిడిఒ వరలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు రమణప్ప, బాబు, నారాయణ, లక్ష్మీనారాయణ, సాలెమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమమే ధ్యేయం : మంత్రి

**పెనుకొండ :** రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి మాటిస్తే మడమతిప్పని నాయకుడని రాష్ట్ర మంత్రి ఉషాశ్రీ చరణ్ పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద నాలుగవ విడత వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారుల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కారక్రమంలో ఉషశ్రీ చరణ్‌తో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, వైసిపి పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా మహిళలకు మెగా చెక్కును పంపిణీ చేసి సీఎంచిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పొదుపు సంఘం మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

### ఐదుగురికి గాయాలు

**ప్రజాశక్తి - నల్లమాడ**

మండలకేంద్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో ప్రధాన రహదారిలో ఆటో బోల్తా పడిన ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మొలక వేముల క్రాస్ నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో నల్లమాడ ఆర్డీటీ కార్యాలయం దగ్గర రహదారి రోడ్డు ప్రక్కన కిందపడి ఉన్న విద్యుత్‌వైరుమీద వెళ్లింది. దీంతో వైరు ఆటోకు చుట్టుకుంది. దీంతో వేగంగా వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొండకమర్ల గ్రామానికి చెందిన లక్ష్మన్న (68) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సందర్భంగా విద్యుత్‌స్తంభం కూడా విరగడంతో అక్కడ పనిచేస్తున్న కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

## వే బిల్ లేకుండా వెండి తరలిస్తున్న వారికి జరిమానా

**చిలమత్తూరు :** వేబిల్లు లేకుండా వెండిని తరలిస్తున్న వారికి అధికారులు జరిమానా విధించారు.కొడికొండ చెక్‌పోస్టు వద్ద సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీలలో భాగంగావే బిల్లులు లేని 45 లక్షల విలువచేసే 57 కేజీల వెండి అభరణాలను పట్టుకున్న చిలమత్తూరు పోలీసులు జిఎస్‌టిఐ, హిందూపురం కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పగించారు.అనంతరం పన్ను రూపంలో(అపరాధ రుసుము) రూ.2.70 లక్షల జరిమాన వేసి నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

## అనర్హులకు అందలం

**పుట్టపర్తి అర్బన్ :** నల్లమాడ మండలం చారుపల్లి గ్రామ సమీపంలోని నల్లగొండలో అనర్హులకు పట్టాలు ఇచ్చారని ఏపీ బెస్త సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ నారాయణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు అడ్వకేట్ వీరనారాయణ విమర్శించారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్ లోని స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 608 చారుపల్లి పొలంలో ఉన్న నల్లగొండ ను అక్కడి తహశీల్దార్ దేవేంద్ర నాయక్ అనర్హులకు పట్టాలు ఇచ్చారన్నారు. గ్రామసభ కానీ, అసైన్మెంట్ కమిటీ ఆమోదం కానీ, ఏమీ లేకుండా ప్రజా ప్రయోజనాల కోసం ఉన్న నల్లగొండను అనర్హులకు దారాదత్తం చేశారన్నారు. దీనిపైన న్యాయ విచారణ జరిపి ఆ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## పిల్లల్లో పోటీతత్వం పెంచడమే ఆర్‌డిటి ధ్యేయం

**మడకశిర :** గ్రామీణ స్థాయి పిల్లలలో పోటీతత్వం పెంచి మంచి గుర్తింపు తీసుకురావడమే ఆర్‌డిటి ప్రధాన ఉద్దేశమని రొళ్ల ఏరియా టీమ్ లీడర్ ఓబులేసు పేర్కొన్నారు. సోమవారం రొళ్ల మండల పరిధి లోని గిడ్డ బొమ్మనపల్లి ఆర్డీటీ పాఠశాలలో రొళ్ల, అగళి మండలాల పిల్లలకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది హనుమంతరాయుడు, శివప్రసాద్, వెంకటేష్, రవికుమార్, కీర్తి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి రఘువీరారెడ్డి జన్మదిన వేడుకలు

**పరిగి :** మాజీమంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి 67వ జన్మదిన వేడుకలను పరిగి మండలం సేవామందిర్ లింగన్న విద్యాసంస్థలలో ఏపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేటీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

**హిందూపురం :** ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా పట్టణంలోని సప్తగిరి కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సోమవారం పరగి మండలం శాసనకోట గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ మంజునాథ్, స్థానిక పాఠశాల హెడ్మాస్టర్ ఆనంద్ రాజ్,కళాశాల పరిపాలనాధికారి గంగిరెడ్డి,ఎన్ఎస్ఎస్ పీవోలు ప్రకాష్ రెడ్డి, నాగేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు

**కదిరి టౌన్ :** కదిరినియోజకవర్గం అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని కదిరికి చెందిన మునికుమార్ దరఖాస్తు చేసుకొన్నారు. ఈ మేరకు మునికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేసామని చెప్పారు. తాను చేపట్టిన కార్యక్రమాలను పరిగణలోకి తీసుకొని అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని కోరినట్లు చెప్పారు.

## స్పందన విజ్ఞప్తులకు తక్షణ పరిష్కారం

**పుట్టపర్తి అర్బన్ :** స్పందనలో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో 280 అర్జీలను జాయింట్ కలెక్టర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, టిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ

## తూతూమంత్రంగా మున్సిపల్ మీట్

**పుట్టపర్తి అర్బన్ :** పుట్టపర్తి మున్సిపల్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా నిర్వహించారు. చైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 20 మంది కౌన్సిలర్లకు గాను 9 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. అయినప్పటికీ కోరం లేకనే సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు. అత్యవసరంగా మధ్యాహ్నం 3 గంటలకు ప్రకటించిన ఈ సమావేశం 4 గంటలైనా మెజార్టీ సభ్యులు హాజరు కాలేదు. దీంతో ఉన్నవారితోనే సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డులలో సిసి రోడ్లు నిర్మాణానికి రూ. 18 లక్షలు మంజూరు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అలాగే తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 5 లక్షలు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు చెరువు భాస్కర్ రెడ్డి, సాయి గీత, కమిషనర్ అంజయ్య మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినూత్న కార్యక్రమంతో ప్రజల్లోకి...

**ధర్మవరం టౌన్ :** గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించేందుకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ప్రజలు తమ సమస్యలను చైతన్యరథంలో ఉన్న ఫిర్యాదుల బాక్సులో ఫిర్యాదులు వేస్తున్నారని టీడీపీ మండల నాయకులు తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నూరు బత్తలపల్లి, దర్శినమల గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్లూరుశ్రీనివాసులు, కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, విజయసారథి, రాఘవరెడ్డి, తెలుగుయువత విజయ్‌చౌదరి, భాస్కర్ చౌదరి, జంగంనరసింహులు పాల్గొన్నారు.



తమ సమస్యలు రాసిన పేపర్లను బాక్సులో వేస్తున్న దృశ్యం

# నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి

కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

**పెనుకొండ :** చంద్రబాబు నాయుడు అరెస్టును జీర్ణించుకోలేక చనిపోయిన పెనుకొండ దర్గాపేటకు చెందిన ఆర్ ఆర్ రహీమ్ కుటుంబాన్ని పరామర్శించడానికి ఈ నెల 14న రానున్న నారా భువనేశ్వరమ్మ పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారధి కోరారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా యాదవ సాధికారక అధ్యక్షులు కేశవయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, కన్వీనర్లు, రవి శంకర్, సిద్దయ్య, సిద్ధ లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

**గోరంట్ల :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి సత్య సాయి జిల్లాలో ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే నిజం గెలవాలి అనే కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారథి కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సోమశేఖర్ జిల్లా కార్యదర్శి వేణు నాయకులు ఉమర్‌ఖాన్, అజమతుల్లా, గంగంపల్లి నరసింహులు, బెల్లాల చెరువు చంద్ర, బొబ్బిలి రామ్మోహన్, శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

**ఓబుళదేవరచెరువు :** చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం మండలంలోని గాజుకుంటపల్లిలో నిర్వహించే పర్యటనను జయప్రదం చేయాలని తెలుగు రైతు నియోజకవర్గ ఉపాధ్యక్షులు అంజనరెడ్డి కోరారు.

**తనకల్లు :** మండల పరిధిలోని కొర్తి కోట గ్రామంలో నారా భువనేశ్వరి మంగళవారం చేపట్టిన పర్యటనను విజయవంతం చేయాలని తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ కోరారు. మండల పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, పెద్ద ఎత్తున హాజరై పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

**మడకశిర :** గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామంలో నిర్వహించే నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కోరారు. ఈ మేరకు ఆయన గుడిబండ తెలుగు దేశం పార్టీ నాయకులతో దిన్నేహట్టిలో సమావేశమై పర్యటన ఏర్పాటు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, గుడిబండ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా వీరశైవ సాధికార అధ్యక్షుడు దుర్గేష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, మాజీ అసుపత్రి కమిటీ ఛైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీలో పలువురు చేరిక

పార్టీలోకి చేరిన వారితో నాయకులు

**కొత్తచెరువు :** మండల పరిధిలోనే మైలసముద్రం గ్రామానికి పలువురు వైసిపిలో చేరారు. గ్రామంలోనిటిడిపి కి చెందిన 20 కుటుంబాలు ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. బారుసాబ్, నాగేంద్ర, జయమ్మ, రామచంద్ర, ప్రమీల, పోతులయ్య, రాజు, కార్తీక్, లక్ష్మమ్మ, నాగమ్మ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

**హిందూపురం :** స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం ఉంటున్న పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలోని టిడిపికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైసిపిలో చేరాయి. సోమవారం స్థానిక వైసిపి కార్యలయంలో ఇన్‌చార్జ్ దీపిక సమక్షంలో వైసిపిలోకి చేరారు. ఈ సందర్బంగా వారందరికి దీపిక పార్టీ కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీ మహేష్ గౌడ్, మహిళా నాయకురాలు నాగమణి, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, నాయకులు వేణుగోపాల్, కుమార్, వరప్రసాద్ రెడ్డి, గంగాధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

**మడకశిర :** పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ఎల్ ఈర లక్కప్ప, సీనియర్ నాయకులు హెచ్‌బి నర్సేగౌడు, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నళిని రంగే గౌడ హరేసముద్రం సర్పంచ్ కరియన్న, నటరాజు, నాగరాజు అధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నుండి క్యాంపురం టిడిపినాయకులు, కార్యకర్తలు శ్రీరామప్ప, ఉగ్రప్ప ,గోవిందరాజు, పూజన్న, మూర్తి, ఈరమ్మ, రత్నమ్మ, దాస, అశ్వర్థప్ప, చంద్రప్ప, ధనరాజు, తిమ్మప్ప తదితరులు వైసిపిలో చేరారు. వారికి నాయకులు వైసిపి కండూవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# టిడిపిలో పలువురు చేరిక

**మడకశిర :** మండలం పరిధిలోని హరేసముద్రం పంచాయతీలో పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. పంచాయతీలోకి వైసిపికి చెందిన శశికుమార్ అధ్వర్యంలో నాగరాజు, నరసయ్య, మల్లేశు, కదురప్ప ,మోహన్ ,హనుమంతరాయప్ప ,జీటీ నరసప్ప, సిటీ తిమ్మప్ప,లక్ష్మమ్మ, సుమిత్రమ్మ ,హనుమక్క పార్వతమ్మ, రామలక్ష్మమ్మ, సుశీలమ్మ, అన్నపూర్ణ, సౌందర్య ,హనుమక్క, నారాయణప్ప ,నరసమ్మతో పాటు మొత్తం 35 కుటుంబాలు వైసిపికి రాజీనామా చేసి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టిడిపి కండూవాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీ నారాయణ, జిల్లా మైనారిటీ అధ్యక్షులు భక్తర్, ప్రధాన కార్యదర్శి కోట్లా రంగేగౌడ, హరేసముద్రం టిడిపి నాయకులు జయరామ్, తిమ్మన్న, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

# దుస్తుల దుకాణం సీజ్‌ను తొలగించాలి

## సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

**ప్రజాశక్తి-గుంతకల్లు**

కుట్ర పూరితంగా పట్టణంలో సీజ్ చేసిన ఇండియన్ స్టోర్ దుస్తుల దుకాణాన్ని వెంటనే తెరిపించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు దుస్తుల దుకాణానికి సీజ్ చేయడాన్ని నిరసిస్తూ బాధిత వ్యాపారి ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చెన్నైకి చెందిన ఓ వ్యాపారి పట్టణంలోని కింది పెట్రోల్ బంక్ వద్ద రూ.కోటి ఖర్చుతో దుస్తుల దుకాణాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు తక్కువ ధరలకు దుస్తులను విక్రయిస్తున్నారన్నారు. దుకాణం ప్రారంభానికి ముందే మున్సిపల్ అనుమతులకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈనేపథ్యంలో తక్కువ ధరకు దుస్తులు అందజేస్తుండటంతో కొనుగోలుదారులు అధికమయ్యారన్నారు. ఇది జీర్ణించుకోలేక పట్టణంలోని పెద్ద వ్యాపారులు మున్సిపల్ అధికారులపై రాజకీయ వత్తిళ్ల తెచ్చి దుకాణాన్ని ఉన్నఫళంగా దుకాణాన్ని సీజ్ చేయించారని ఆరోపించారు. అనుమతులు లేకుండా పట్టణంలో అనేక మంది వ్యాపారాలు చేస్తున్నారన్నారు. వాటిని సీజ్ చేయని అధికారులు ఈ దుకాణాన్నే ఎందుకు సీజ్

కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

చేశారని ప్రశ్నించారు. వెంటనే దుకాణంపై సీజ్‌ను ఎత్తివేయాలని, లేనిపక్షంలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## బుక్కరాయసముద్రం సర్పంచి చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలి

**బుక్కరాయసముద్రం :** మండల కేంద్రం సర్పంచి చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలని ఎస్సీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆందోళనలో వారు మాట్లాడుతూ ఎస్సీ నియోజకవర్గం అని పేరుకు మాత్రమే ఉందన్నారు. పెద్దనం అందా అగ్రవర్ణాల చేతుల్లోనే ఉందన్నారు. ఇందుకు బుక్కరాయసముద్రం సర్పంచి చెక్‌పవర్‌ను తొలగించడమే నిదర్శనమన్నారు. వెంటనే సర్పంచి చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటాపురం చంద్ర, డప్పు కళాకారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముకుందాపురం నాగరాజు, మండల అధ్యక్షుడు రేకలకుంట రామాంజనేయులు, మండల కార్యదర్శి రెడ్డిపల్లి నాగేష్ పాల్గొన్నారు.

## బడుగుల గుండెల్లో పరిటాల కుటుంబం

**ఆత్మకూరు :** బడుగు, బలహీన వర్గాల గుండెల్లో పరిటాల కుటుంబం చిరస్థాయిగా నిలిచే ఉంటుందని టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చి బికె పార్థసారథి, కాలవ శ్రీనివాసులు, జొన్నా సూర్యనారాయణ, చమన్‌సాబ్ వంటి వారిని అందలం ఎక్కించిన ఘనత పరిటాల రవీంద్రకే దక్కుతుందన్నారు. అంతేగాకుండా రాప్తాడు నియోజకవర్గంలో మండలాలు వారీగా కురుబ, వాల్మీకి, దళితులను ఎంపిపి, జడ్పీటిసిలను చేశారని గుర్తు చేశారు. అయితే చమన్‌సాబ్ మరణానికి పరిటాల కుటుంబం అని తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి మాజీ కన్వీనర్ మనోరంజని,గ్రామ కమిటీ అధ్యక్షులు బొమ్మయ్య, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్, అక్కులన్న, నాయకులు వాల్మీకి కందల ఓబులు, వెంకటేశులు, గాలి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు అండగా టిడిపి : మాజీమంత్రి కాలవ

**ప్రజాశక్తి-డి.హీరేహాల్**

రాష్ట్రంలో బిసిలకు అండ గా నిలిచిన ఏకైక పార్టీ టిడిపి అని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని కాజులూరు గ్రామంలో మండల కన్వీన ర్ హనుమంతురెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నప్పు డు బీసీలకు అన్నివిధాలుగా పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. దేశంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీ టిడిపి అన్నారు. వైసిపి ప్రభుత్వం బీసీ ఓటర్లతో గద్దెనెక్కి మొండిచేయి చూపించిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి బీసీల సత్తా ఏంటో ఓట్ల రూపంలో చూపించాలని పిలుపునిచ్చారు. కాగా మండలంలోని పాత హడగలి, కొత్త హడగలి గ్రామాలకు చెందిన 20 కుటుంబాలు సోమవారం టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు పార్టీ కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు మల్లికార్జున, గంగాధర్, నాయకులు సోమలాపురం శంకర్, వన్నూరుస్వామి, శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి శ్రీరాములు, నాగల్లి, పుష్పావతి, ఓబుళాపురం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జగన్‌కు అండగా నిలవాలి : మాజీ ఎమ్మెల్యే విశ్వ

**ఉరవకొండ :** పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సిఎం జగన్‌కు మరోసారి అండగా నిలబడదామని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లి గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా లింగాల సంగమేశ్వర స్వామి, నాగిరెడ్డిపల్లిలోని కుంటెమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అనంతరం కూడేరు మండల కేంద్రం నుంచి ఇప్పేరు, నాగిరెడ్డిపల్లి మీదుగా మరుట్ల వరకూ రూ.6.40కోట్లతో చేపట్టనున్న తారు రోడ్డు పనులకు ఎంపిపి నారాయణరెడ్డి, జడ్పిటిసి అశ్వినితో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకర్‌నారాయణ, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నాయకులు వీరన్న, నారాయణరెడ్డి, కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి అశ్విని, బైరెడ్డి రామచంద్రారెడ్డి, వైస్ ఎంపిపిలు సుబ్బమ్మ, దేవా, ఇప్పేరు రమేష్, దేవేంద్ర, నాయకులు తుప్పటి హరీష్, సిద్ధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాపర్‌వైరు చోరీ

**ఆత్మకూరు :** మండల పరిధిలోని మదిగుబ్బ గ్రామానికి చెందిన రైతు కురుబ పుల్లన్న ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి కాపర్‌వైరును చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు పుల్లన్నకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి కాపర్ వైరును చోరీ చేశారు. ఉదయం తోట వద్దకు వచ్చి రైతు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన విషయాన్ని గమనించి వెంటనే విద్యుత్ శాఖ ఎఇతోపాటు ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా దాదాపు 13 ఎకరాల్లో వివిధ రకాలు పంటలు సాగు చేశానని, ఈ సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోతే పంటలు అన్నీ ఎండిపోతాయని బాధిత రైతు వాపోయారు. విద్యుత్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి పంటలను కాపాడాలని బాధిత రైతు కోరుతున్నాడు.